# మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం టి-సాట్ మధ్య అవగాహన ఒప్పందం

## ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాలు, సర్టిఫికెట్ కోర్సుల విస్తరణకు శ్రీకారం

నల్గొండ, జూన్18 (వుదయం ప్రతినిధి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ) బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం మరియు తెలంగాణ స్కిల్ అండ్ అకాడమిక్ ట్రైనింగ్ (టి-సాట్) సంయుక్త ఆధ్వర్యంలో మరిన్ని ఆన్‌లైన్ తరగతులు, ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సుల ప్రారంభానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, టి-సాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం ద్వారా విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యా అవకాశాలు మరింత విస్తృతంగా, ఉపయోగకరంగా మారనున్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పరిమిత వనరులు కలిగిన ప్రాంతాల్లోని యువతకు, నైపుణ్యాభివృద్ధి కోరుకునే వారికి ఈ ఆన్‌లైన్ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నాణ్యమైన పాఠ్యాంశాలు, వ్యవహారిక శిక్షణా మాడ్యూల్స్ ద్వారా విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెరిగేలా కోర్సులను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని ఇతర విభాగాలకు కూడా విస్తరించాలని ఆకాంక్షించారు. టి-సాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే టి-సాట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్థిక, భౌగోళిక పరిమితుల కారణంగా విద్యా అవకాశాలకు దూరమైన వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ వేదికను రూపొందించామని చెప్పారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సర్టిఫికెట్ ప్రోగ్రాములు రూపొందించి, విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం గతంలో నిర్వహించిన టూరిజం మేనేజ్‌మెంట్ ఆన్‌లైన్ తరగతులకు లభించిన స్పందన నేపథ్యంలో, త్వరలో టూరిజం మేనేజ్‌మెంట్ మరియు లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. లైవ్ లెక్చర్లు, రికార్డెడ్ పాఠ్యాంశాలు, అసైన్‌మెంట్లు, వర్క్‌షాప్‌లతో కూడిన శిక్షణా విధానానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా ఇప్పటికే కొనసాగుతున్న టూరిజం ఆన్‌లైన్ తరగతులను మరింత విస్తరించడంతో పాటు, కొత్త సర్టిఫికెట్ కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాదిక్, జనరల్ మేనేజర్ లింగారెడ్డి, ఎంజీయూ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య అలవాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, డా. సభినా హరాల్డ్, డా. మిరియాల రమేష్, డా. వెంకట రమణారెడ్డి, డా. లక్ష్మీప్రభ, ఆచార్య శ్రీలక్ష్మి, డా. శ్వేత, డా. అనురాధ, డా. జక్క సురేష్ రెడ్డి, డా. కట్ట కిరణ్ మై, డా. జ్యోతి, రమేష్ నాయక్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# అవినీతిపై ప్రశ్నించిన పాత్రికేయులపై అనుచిత వ్యాఖ్యలు సమంజసమేనా?

## పినపాక ఉపాధి ఏపీవో వీరభద్ర స్వామి వ్యాఖ్యలపై ఆగ్రహం.. అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నమా?

పినపాక:జూన్ 18 (వుదయం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం లోని పోట్లపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో అవకాతవకలు జరిగినట్లు డిజిటల్ నకిలీ హాజరు నమోదుకు సంబంధించిన అంశం జిల్లా స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై "వుదయం" దినపత్రికలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విచారణకు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఇదే అంశంపై సంబంధిత పినపాక మండల ఉపాధి ఏపీవో వీరభద్ర స్వామిని జర్నలిస్టు వివరణ కోరగా, "మీరు డబ్బు కోసమే వార్తలు రాస్తున్నారు.. మీకు డబ్బు కావాలా?'' అంటూ మాట్లాడడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న మీడియా ప్రతినిధుల పట్ల ఇటువంటి వ్యాఖ్యలు చేయడం పత్రికా వర్గాల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

డిజిటల్ హాజరు నమోదులో జరుగుతున్న అక్రమాలను సంబంధిత పినపాక మండల ఏపీఓ వీరభద్ర స్వామి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ,



"మీరు పంపించిన సమాచారం తప్పుడు సమాచారం. కేవైసీ విధానంలో ఫోటోలు తీసుకుంటాం. అలాంటి అవకతవకలు జరగడానికి అవకాశం లేదు" అని అన్నారు. అయితే, అనంతరం జిల్లా స్థాయిలో విచారణకు ఆదేశాలు జారీ కావడంతో, ప్రారంభ దశలో ఫిర్యాదులను మండల ఏపీవో నిర్లక్ష్యం చేసిన తీరు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజాధనంతో అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు భంగం కలిగించే ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అవకతవకలపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు కాకుండా, వాస్తవాలను వెలికితీసే దిశగా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు. ప్రశ్నించిన జర్నలిస్టులపై ఆగ్రహంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం కాదు, జరిగిన అవకాతవకల విషయంపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం అధికారుల బాధ్యత. డిజిటల్ హాజరు అక్రమాలపై, మీడియాపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై జిల్లా కలెక్టర్ స్వయంగా దృష్టి సారించి పారదర్శక విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారుపినపాక మండల ఎంపీడీవో వివరణ కోరగా...ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై ఏపీవో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు అలా చేసిన వారిపై జిల్లా అధికారుల దృష్టికి చేరవేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీత నాదెళ్ల బాలకృష్ణకు పౌర సన్మానం



కోదాడ, జూన్ 18(వుదయం )

ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డు అందుకున్న కోదాడ రూరల్ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపకులు నాదెళ్ల బాలకృష్ణకు మండలంలోని రెడ్లకుంట గ్రామంలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘన పౌర సన్మానం నిర్వహించారు. విద్యుత్ శాఖలో ప్రజలకు అందిస్తున్న సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొలంపల్లి కుటుంబరావు, వైస్ సర్పంచ్ మల్లెల ప్రసాద్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగవరపు లక్ష్మణరావు, విద్యుత్ శాఖ సిబ్బంది తిరుపతిరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రామారావు, అంబరీష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన టీజీ టెట్--2026 పరీక్షలు

## జిల్లా కేంద్రంలో సజావుగా నిర్వహణ.. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 (వుదయం ప్రతినిధి)జిల్లాలో గురువారం నిర్వహించిన టీజీ టెట్ జూన్--2026 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని అనూ బోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా సాగాయి. మొదటి విడత పరీక్షకు మొత్తం 145 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 130 మంది హాజరై పరీక్ష రాశారు. రెండో విడతలో 135 మంది అభ్యర్థులకు గాను 101 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, భద్రత తదితర సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ చేపట్టిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యమైన విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో టీజీ టెట్--2026 పరీక్షలు విజయవంతంగా ముగిశాయని ఆయన పేర్కొన్నారు.

# పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

## 'అమ్మమాట--అంగన్వాడి బాట' కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా

## అంగన్వాడీ సేవలపై విస్తృత ప్రచారం చేపట్టి లబ్ధిదారుల సంఖ్య పెంచాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 (వుదయం ప్రతినిధి) చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా తెలిపారు. గురువారం పాల్వంచ ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సెక్టార్‌లోని ఇంద్రానగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన "అమ్మమాట--అంగన్వాడి బాట" కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, లబ్ధిదారుల సంఖ్య పెరిగేలా ప్రతి అంగన్వాడీ టీచర్ ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. తల్లి--బిడ్డల జీవితంలో అత్యంత కీలకమైన తొలి వెయ్యి రోజుల సంరక్షణను ధ్యేయంగా తీసుకుని, ప్రతి కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య, ఆటపాటలతో కూడిన అభ్యాసాన్ని అందించాలని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పెరటి తోటలను అభివృద్ధి చేసి వాటి ద్వారా లభించే పంటలను నమోదైన లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. జిల్లాలో తీవ్ర పోషకాహార లోపం, అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య పూర్తిగా తగ్గే వరకు అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా పరిశీలించి, వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని



సూచించారు.

కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారిణి, స్థానిక సర్పంచ్‌లతో కలిసి లక్ష్మీదేవిపల్లి సెక్టార్‌కు చెందిన అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం నాణ్యమైన యూనిఫాంలు, విద్యారంభం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న, శ్రీనగర్ పంచాయతీ సర్పంచ్ రాణి, లక్ష్మీదేవిపల్లి సెక్టార్ సూపర్వైజర్ రమాదేవి, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త సంపత్, మహిళా సాధికారిత జిల్లా కోఆర్డినేటర్ రూప సంతోషి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# యూరియా కోసం ఇక యాప్ బుకింగ్ తప్పనిసరి

## రైతులకు వ్యవసాయ శాఖ సూచన



చర్ల, జూన్ 18 (వుదయం ప్రతినిధి) రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు వ్యవసాయ శాఖ అధికారిణి లావణ్య తెలిపారు. యూరియా అవసరమున్న రైతులు ఇకపై సంబంధిత యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని ఎరువులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. యాప్ ద్వారా బుకింగ్ చేయడం వల్ల రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, అవసరమైన ఎరువుల పరిమాణం వంటి సమాచారం నమోదై సరఫరా ప్రక్రియ మరింత క్రమబద్ధంగా సాగుతుందని వివరించారు. అయితే కొందరు రైతుల మొబైల్ నంబర్లు యాప్‌లో నవీనకరించబడకపోవడంతో బుకింగ్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. సదరు రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫోన్ నంబర్ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకే యూరియా పంపిణీ జరిగే అవకాశం ఉన్నందున, ప్రతి రైతు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఆదివాసులకు

# పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలి..






## వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి అని మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మీడియం బాబురావు

పినపాక: (జూన్ 18 వుదయం ప్రతినిధి) గిరిజన సమస్యలపై రాజీ లేని పోరాటం కొనసాగించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మీడియం బాబురావు పిలుపునిచ్చారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మీడియం బాబురావు ముఖ్య అతిథిగా హాజరై గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, పోడు భూముల అంశాలపై మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు, మహిళలు, యువకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు. మహాసభకు ముందు సీతారాంపురం గ్రామం నుంచి ఈ బయ్యారం క్రాస్‌రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది గిరిజనులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కొమ్ము నృత్యాలు, జానపద కళారూపాలను ప్రదర్శించారు. డప్పుల మోతలు, సంప్రదాయ గీతాల నడుమ సాగిన ఈ ర్యాలీ స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. గిరిజనుల ఐక్యత, సామాజిక చైతన్యాన్ని చాటిచెప్పే విధంగా ర్యాలీ కొనసాగింది.

ర్యాలీ అనంతరం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లోని కొమరం భీం విగ్రహం వద్దకు చేరుకున్న గిరిజనులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన కొమరం భీం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోరాటాలను కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం దుబ్బ గోవర్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహాసభలో గిరిజనుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మీడియం బాబురావు రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోడు భూముల సమస్య ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడం వల్ల వేలాది గిరిజన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులకు హక్కు పత్రాలు అందించి భూ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు నివసించే ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాల వరకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. వలస గిరిజనుల సమస్యలపై కూడా మీడియం బాబురావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉపాధి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన గిరిజనులు తమ గిరిజన హోదాను కోల్పోరని స్పష్టం చేశారు. వారు ఎక్కడ నివసిస్తున్నారనే కారణంతో కుల ధ్రువీకరణ పత్రాలు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అర్హులైన వలస గిరిజనులకు వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూమి, అటవీ, నీటి హక్కులను పరిరక్షించేందుకు సంఘటిత పోరాటాలు అవసరమని మీడియం బాబురావు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి గిరిజనులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

మహాసభలో గిరిజనుల హక్కుల సాధన, పోడు భూముల సమస్యల పరిష్కారం, వలస గిరిజనులకు న్యాయం కల్పించే అంశాలపై పలు తీర్మానాలు ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా దుబ్బా గోవర్ధన్, మండల కార్యదర్శిగా మడివి రమేష్, తో కూడిన కమిటీని ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు గౌరీ నాగేశ్వర రావు, కార్యదర్శి కారం పుల్లయ్య,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న, మండల నాయకులు కల్తీ నాగేశ్వర రావు, కూరసం లక్ష్మయ్య, నూపా కృష్ణ , వివిధ గ్రామాల ప్రతినిధులు,ఆదివాసి మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అవసరం

## సాంకేతిక నైపుణ్యాలతోనే భవిష్యత్తు అవకాశాలు: ప్రొఫెసర్ ఆచార్య జాన్ మిల్టన్



భద్రాచలం, 18 జూన్ 2026, వుదయం ప్రతినిధి:ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆచార్య జాన్ మిల్టన్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక రంగాల్లో విద్యార్థులు నైపుణ్యాలు సంపాదించుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన అన్నారు. గురువారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన "ఇంటర్న్‌షిప్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ లెర్నింగ్" శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఐదవ సెమిస్టర్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమం విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం, డిజిటల్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గతంలో పుస్తకాల ద్వారా మాత్రమే జ్ఞానాన్ని సంపాదించేవారని, ప్రస్తుతం డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారాన్ని క్షణాల్లో అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాబోయే కాలంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందని, విద్యార్థులు ఇప్పటి నుంచే దానిపై అవగాహన పెంపొందించుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేవలం కంప్యూటర్ శాస్త్రానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, వైద్యం, వ్యవసాయం, విద్య, వ్యాపారం, పరిశ్రమలు, ప్రభుత్వ పరిపాలన, పరిశోధన రంగాల్లో కూడా విస్తృతంగా ఉపయోగపడుతోందని ఆయన వివరించారు. అందువల్ల అన్ని విభాగాల విద్యార్థులు ఏఐపై కనీస పరిజ్ఞానం కలిగి ఉండటం అవసరమన్నారు. శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రద్ధ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాథమిక సూత్రాలు, డిజిటల్ లెర్నింగ్ విధానాలు, ఆధునిక సాఫ్ట్‌వేర్‌ల వినియోగం, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రాధాన్యత, డిజిటల్ భద్రత, సమాచార సేకరణ మరియు విశ్లేషణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు ఉపయోగపడే అనేక డిజిటల్ టూల్స్‌ను కూడా పరిచయం చేశారు విద్యార్థులు శిక్షణా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జూన్ 18 మరియు 19 తేదీలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.వి. రావు, డాక్టర్ శ్రీలత, రమేష్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ హవిలా, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై మరింత ఆసక్తి కనబరిచారు. భవిష్యత్తులో డిజిటల్ ప్రపంచంలో తమకు ఎదురయ్యే అవకాశాలు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

# అవధూత చక్రవర్తి శ్రీరామదూత స్వామి వారి అవతరణ మహోత్సవం



మేళ్లచెరువు /హుజూర్నగర్ జూన్ 18 వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో ఏరువాక గణపతి స్వామి వారి దేవాలయం వద్ద అవధూత చక్రవర్తి, విశ్వ గురువు, కలియుగ అవతార మూర్తి భగవాన్ శ్రీ శ్రీ రామదూత స్వామి వారి 62వ అవతరణ మహోత్సవం ( జన్మదిన) వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారి నామస్మరణ చేస్తూ భజనలు ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చాలా ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారి జన్మదిన సందర్భంగా మేళ్లచెరువులో అత్యంత వైభవముగా హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. ఇట్టి హోమంలో సుమారు ఒక వంద జంటలు దంపతులుగా పాల్గొన్నారు. సాక్షాత్తు ఆ శ్రీమహావిష్ణువు దివ్య స్వరూపమే భగవాన్ శ్రీ శ్రీ రామదూత స్వామి వారు అని,స్వామివారిని నమ్ముకున్న వారికి వారి వారి కర్మలు తొలగించి ఆరోగ్య, ఆర్థిక, కుటుంబ, వ్యవసాయ,వివాహ, ఉద్యోగ,వ్యాపార సంబంధిత బాధలన్నీ తొలగిపోతాయని, జీవితాలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా అనుగ్రహిస్తూ ఉన్న దివ్య అవతార మూర్తి శ్రీ స్వామివారు అని భక్తులు ఆయన మహిమలను తలుచుకొని తరించిపోతున్నారు. స్వామి వారి జన్మదిన వేడుకల అనంతరం స్వామివారి సేవకులు భక్తులకు తీర్థప్రసాదాలు మరియు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

# గోదావరి పరివాహక ప్రజలకు హెచ్చరిక

**రానున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ముందస్తు జాగ్రత్తలతోనే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 (వుదయం ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి పరివాహక ప్రాంతాల్లో రానున్న రోజుల్లో కురిసే భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదల కారణంగా పలుమార్లు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్న సంఘటనలు ప్రజలకు ఇప్పటికీ గుర్తుండే ఉన్నాయి.

ప్రత్యేకించి నదీ తీర గ్రామాలు, వాగుల సమీపంలోని నివాస ప్రాంతాలు, ముంపునకు గురయ్యే కాలనీల ప్రజలు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేలా తాగునీరు, పొడి ఆహారం, మందులు, ముఖ్యమైన పత్రాలను ముందుగానే భద్రపరచుకోవడం అవసరం.

జిల్లా యంత్రాంగం వరదలపై ప్రత్యేక దృష్టి సారించి పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండటం అభినందనీయం. గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించడం, పునరావాస కేంద్రాలను సిద్ధం చేయడం వంటి చర్యలు మరింత సమర్థవంతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

గోదావరి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్న సమయంలో ప్రజలు నదుల్లో స్నానాలు చేయడం, చేపల వేటకు వెళ్లడం, వరద నీటిని దాటి ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగల సమీపానికి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజల అప్రమత్తత అధికారుల ముందస్తు ప్రణాళిక సమన్వయంతో కూడిన చర్యలే వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే ప్రధాన మార్గమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. వుదయం దినపత్రిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది.

# కిన్నెరసానిలో హరిత శంఖారావం.. వర్చువల్‌గా వన మహోత్సవాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తులు -- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**జిల్లాలో 55 లక్షల మొక్కల నాటడమే లక్ష్యం -- జిల్లా కలెక్టర్ అంకిత్**



**కిన్నెరసానిలో పర్యాటక అభివృద్ధి పనులకు శ్రీకారం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 (వుదయం ప్రతినిధి) రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హరిత కార్యక్రమాలతో పాటు కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రూ. 45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అడవి సందర్శన వాహనాలు, ప్రకృతి నడక మార్గం, సీతాకోకచిలుకల ఉద్యానవనం, జింకల పార్కులో మేత నిల్వ శాల, సిమెంట్ రహదారి తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంయుక్తంగా ప్రారంభించారు.

కిన్నెరసానిని రాష్ట్ర ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాంఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం నిలిచిందని పేర్కొన్నారు. కిన్నెరసాని తెలంగాణకు ఊపిరితిత్తుల వంటిదని అభివర్ణించిన ఆయన, గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు భూములపై హక్కులు కల్పించడంతో పాటు కొత్తగా అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కిన్నెరసానిని రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, తీగల వంతెన నిర్మాణం, అద్దాల మేడ, జంతు ప్రదర్శనశాల, బోటు విహారం, పర్యాటక అతిథి గృహాల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మణుగూరు వేడి నీటి గుంతల ప్రాంతం వరకు అడవి సందర్శన మార్గాన్ని విస్తరించడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

కొత్తగూడెం పట్టణానికి రూ. 500 కోట్ల వ్యయంతో వలయాకార రహదారి, భారీ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అటవీ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో హరితాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

**మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలి**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 50 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని, ప్రజల జీవన విధానం అడవులతో ముడిపడి ఉందన్నారు. వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం 42 శాఖలకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గత ఇరవై నాలుగు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. నాటిన మొక్కల్లో కనీసం 95 శాతం మొక్కలు చెట్లుగా ఎదిగేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఎనిమిది లక్షల ఎకరాల్లో అటవీ సంపద**

జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల అటవీ భూమి ఉందని తెలిపారు. గతంలో కొంత మేర అటవీ భూమి కోల్పోయినప్పటికీ ప్రస్తుతం ప్రభుత్వం అటవీ సంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధి, అటవీ సంరక్షణ, గిరిజన సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

అనంతరం అడవి సందర్శన వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ వజ్జా రామకృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛమైన తాగునీటి

**ప్రాముఖ్యత నీటి వనరుల సంరక్షణ నీటి వృథాను పంచాయతీలలో జల మహోత్సవ వేడుకలు**

పినపాక: (జూన్ 18 వుదయం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సీతారాంపురం, పినపాక గ్రామ పంచాయతీ లో జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం జల మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి ప్రాముఖ్యత, నీటి వనరుల సంరక్షణ, నీటి వృథాను నివారించే మార్గాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి నీటి బొట్టును ఆదా చేయడం ద్వారా భావితరాలకు తాగునీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. జల జీవన్ మిషన్ లక్ష్యం ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడమేనని పేర్కొన్నారు. మినరల్ వాటర్ వాడకుండా మిషన్ భగీరథ నీటిని తాగాలని ఈ సందర్భంగా సూచించారు. పూర్తిస్థాయిలో క్లీనింగ్ చేసిన తర్వాత మాత్రమే నీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం గ్రామ సర్పంచ్ అనిత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పినపాక సర్పంచ్ అలివేలు పినపాక సెక్రటరీ ఉమామహేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈ ప్రవీణ్, మిషన్ భగీరథ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖమ్మం వి6 రిపోర్టర్ ఖదీర్ పై కేసు నమోదు



ఖమ్మం వుదయం బ్యూరో, జూన్18 : ఖమ్మం వి 6 జిల్లా రిపోర్టర్ సయ్యద్ ఖదీర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం నగరంలోని పార్సీబంధానికి చెందిన రాము సుధా అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఖమ్మం వన్ టౌన్ పోలీసులు ఖదీర్ పైనేగాక, మరికొందరిపై బీఎన్ఎస్ చట్టంలోని 329(4),115(2), 324(2), 79, 351(2), 296(ఎ), 118(1), రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఖదీర్ తో పాటు అతనికి సంబంధించిన మరో 12 మంది తమ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారని, తమను చంపడానికి ప్రయత్నించారనేది రాము సుధా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు సారాంశం. ఖదీర్ పై పోలీసులు ఈనెల 16వ తేదీన కేసు నమోదు చేయగా, గురువారం వెలుగులోకి వచ్చింది.

# అమీనాబాద్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం



అనంతగిరి జూన్ 18 వుదయం

మండల పరిధిలోనీ అమీనాబాద్ గ్రామంలో జరిగిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి,ముస్కు శ్రీనివాస్ రెడ్డి,కొండపల్లి వాసు,డేగ కొండయ్య,ముత్తినేని కోటేశ్వరరావు,జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతానికి విద్యుత్ స్తంభాల ఏర్పాటు



దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో గల మల్లారం శివారులో సుమారు 80 కుటుంబాలు పైగా ఆరు సంవత్సరాలుగా కరెంట్ సదుపాయం లేకుండా నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి దమ్మపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్ తదితర నాయకులు తెలియజేసి గత పది రోజుల క్రితం విద్యుత్ శాఖ ఏఈ సమక్షంలో అక్కడ నివాసం ఉంటున్న వాసులకు ప్రభుత్వం ఒక కిలోమీటర్ పరిధిలో గల నివాసల కు ఎలాంటి చార్జీలు లేకుండా కరెంట్ లైన్ సదుపాయం చేసే అవకాశం కల్పించిందని తెలియజేశారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం 20కి పైగా కరెంటు స్తంభాలను ఆ నివాసల మధ్య పాతించారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు మాట్లాడుతూ కరెంట్ లేని ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించే విషయం అని, ఇప్పటికే తమ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్న తరుణంలో, విద్యుత్ సౌకర్యం లేని దూర ప్రాంతాలకు కూడా కరెంటు లైన్లు చార్జీలు లేకుండా చేస్తున్న తీరు దేశంలో ఎక్కడ లేదు అన్నారు. చార్జీలు లేకుండా కిలోమీటర్ పరిధిలో గల ప్రాంతాలకు కరెంట్ లైన్ లాగి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి క్యాబినెట్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రూపా రాంబాబు, చిన్నశెట్టి గోపి, అప్పారావు, మళ్ళా చిన్నా, మణికంఠ తదితరులు ఉన్నారు.

# గిరిజన విద్యార్థుల విద్యా నైపుణ్యాల పెంపుకు ‘ఉద్దీపకం’ వర్క్‌బుక్స్ -- ఐటీడీఏ ప్రత్యేక కార్యాచరణ



భద్రాచలం, 18 జూన్ 2026, వుదయం ప్రతినిధి :గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు మరియు జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా ప్రత్యేకంగా రూపొందిస్తున్న “ఉద్దీపకం వర్క్‌బుక్స్” విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. విద్యార్థులలో ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాది ఏర్పడితేనే ఉన్నత విద్యలో వారు మెరుగైన ప్రతిభ కనబరచగలరని ఆయన పేర్కొన్నారు. గురువారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు రూపొందిస్తున్న ఉద్దీపకం వర్క్‌బుక్స్‌కు సంబంధించిన ప్రణాళికలు, బోధనా విధానాలు, పాఠ్యాంశాల రూపకల్పనపై ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలు, ఏహెచ్‌ఎస్, ఏపీఎస్ మరియు జీపీఎస్ పాఠశాలల్లో అమలు చేయనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేందుకు అనువైన విధంగా వర్క్‌బుక్స్ రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల వయస్సు, అభ్యాస స్థాయికి అనుగుణంగా సులభమైన భాషలో, చిత్రాలతో, ఉదాహరణలతో కూడిన పాఠ్యాంశాలను రూపొందించడం ద్వారా వారు స్వయంగా చదవడం, అర్థం చేసుకోవడం, రాయడం వంటి నైపుణ్యాలను పెంపొందించుకోగలరని వివరించారు. గత విద్యా సంవత్సరంలో మూడో తరగతి విద్యార్థులకు ప్రధానంగా గణిత అంశాలపై దృష్టి సారించి వర్క్‌బుక్స్ రూపొందించగా, అవి ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. విద్యార్థులు గుణకారాలు, భాగహారాలు, సంఖ్యాజ్ఞానం వంటి అంశాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు స్వయంగా సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది మరింత విస్తృతంగా ప్రణాళిక రూపొందించి ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల కోసం తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాలను సమగ్రంగా కలిపి ప్రత్యేక వర్క్‌బుక్ రూపొందిస్తున్నామని తెలిపారు. అలాగే మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల కోసం గణితంతో పాటు ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను పెంపొందించే విధంగా ప్రత్యేక పుస్తకాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారి ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు కొత్త పదాలు, సృజనాత్మక వ్యాయామాలు, అవగాహన పరీక్షలు కూడా చేర్చుతున్నామని వివరించారు.

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పోటీ ప్రపంచానికి సిద్ధమయ్యేలా 7వ, 8వ, 9వ తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన అంశాలను కూడా వర్క్‌బుక్స్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేలా చిన్న వయస్సు నుంచే సాధారణ జ్ఞానం, తార్కిక ఆలోచన, గణిత నైపుణ్యాలు, భాషా సామర్థ్యాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన ఎస్‌జీటీ ఉపాధ్యాయులు దాదాపు 60 రోజుల పాటు విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించి, వారి అవసరాలకు అనుగుణంగా ఈ వర్క్‌బుక్స్ రూపొందిస్తున్నారని రాహుల్ తెలిపారు. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా, ఉపాధ్యాయులు బోధించేందుకు అనుకూలంగా ఉండే విధంగా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఐటీడీఏ పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఉద్దీపకం వర్క్‌బుక్స్ కూడా అందులో భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు భవిష్యత్తులో మెరుగైన విద్యా ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీమతి చందన, ఏసీఎంఓ రమేష్, ఆశ్రమ పాఠశాలలు, ఏపీఎస్, జీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# మద్యం సిండికేట్ ముసుగులో బెల్ట్ దుకాణాల విస్తరణ..?

**మద్యం సిండికేట్‌కు అధికారుల మౌనమే అండనా..? జిల్లాలో తీవ్ర చర్చ**

**ఎక్సైజ్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 18 (వుదయం ప్రతినిధి) జిల్లాలో మద్యం సిండికేట్ వ్యవస్థ ప్రోత్సాహంతో బెల్ట్ దుకాణాల నిర్వహణ రోజురోజుకు విస్తరిస్తోందన్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పాఠశాలలు, దేవాలయాలు, జనావాసాలకు సమీపంలోనే బెల్ట్ దుకాణాలు నిర్భయంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం సిండికేట్ వ్యవస్థ పై అధికారుల మౌనమే వారికి అండగా మారుతుందా అనే విషయం ప్రజల్లో తీవ్రమైన చర్చకు దారితీస్తుంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ బెల్ట్ దుకాణాల వల్ల మహిళలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు సాగుతుండటంతో అనేక ప్రాంతాల్లో శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని ప్రజలు చెబుతున్నారు.

జిల్లాలో కొంతమంది మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ దుకాణాలకు సరఫరాలు చేస్తూ అక్రమ విక్రయాలను ప్రోత్సహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవస్థపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పలు సందేహాలకు తావిస్తోందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. “జిల్లాలో బెల్ట్ దుకాణాల సంఖ్య పెరుగుతున్నా ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదు? అక్రమ విక్రయాల వెనుక ఉన్న సిండికేట్ వ్యవస్థపై ఎందుకు సమగ్ర విచారణ చేపట్టడం లేదు? ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోవడానికి కారణాలేమిటి?” అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

మద్యం అక్రమ విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, బెల్ట్ దుకాణాల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని, సిండికేట్ వ్యవస్థ ఉన్నట్లయితే దానిపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

# భారీ వర్షాలు, వరదల పట్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**-- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జూన్ 18 వుదయం ప్రతినిధి

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శాఖ తమ బాధ్యతలను గుర్తించి, ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గత అనుభవాలు, జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందస్తు ప్రణాళికతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించలని, అదే విధంగా మండల స్థాయిలో రెవెన్యూ విభాగం తరపున తహశీల్దార్లు, డీపీఓలు, ఇతర అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే కాలనీలను, ఎక్కువ ఇళ్లు దెబ్బతినే అవకాశం ఉన్న ఏరియాలను ముందుగానే ఐడెంటిఫై చేయాలని సూచించారు. వరద బాధితులను తరలించేందుకు వీలుగా ప్రతి గ్రామంలోనూ ఎత్తైన ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ హాళ్లు, రీహ్యాబిలిటేషన్ సెంటర్లు, రైతు వేదికలను గుర్తించాలని, అక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం, ప్రాథమిక వసతులు, నీరు, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవకుండా డీవాటరింగ్ పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, సహాయక చర్యల కోసం పోలీసు శాఖ సమన్వయం తీసుకోవాలని, విపత్తుల సమయంలో అగ్నిమాపక శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని వారితో పాటు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటాయని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్లకు అవసరమైన రోప్స్, కట్టర్స్, లైఫ్ జాకెట్లు వంటి సామగ్రిని అందుబాటులో ఉంచాలని, అవసరమైతే తక్షణమే ప్రొక్యూర్మెంట్ చేసుకోవాలని ఫైర్ డిపార్ట్ మెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు వరుసగా కురిసినప్పుడు పాత, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు అలాంటి భవనాలను గుర్తించి, అత్యవసర సమయాల్లో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

# కాంగ్రెస్ వ్యాఖ్యలను ఖండించిన అంజిరెడ్డి



**సంగారెడ్డివుదయం :**

భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, జిల్లా ఇంచార్జి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్‌పాండే, మాణిక్‌రావు, గొల్ల భాస్కర్, దోమల విజయ్‌కుమార్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, SIR ప్రక్రియపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రభుత్వ ఉద్యోగులు, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజలను ఆందోళనకు గురిచేసే చర్య అని అన్నారు.SIR ప్రక్రియ ద్వారా చట్టబద్ధమైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగదని, దేశ పౌరులు కాని విదేశీయులు అక్రమంగా ఓటర్ల జాబితాలో ఉంటే వారిని మాత్రమే తొలగిస్తారని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో SIR ప్రక్రియ నిర్వహించిన తర్వాత 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైందని పేర్కొంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించడం మానుకోవాలని ఆయన సూచించారు.

# దుద్దెడ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి**



కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం రోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ వరిగంటి శాస్త్రి, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిధిగా పాల్గొనగ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారుపాఠశాల ఉపాధ్యాయులు. చిన్నారులచే అక్షరాభ్యాసం నిర్వహించిన అనంతరం డీఈఓ శాస్త్రి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు, పేద విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వసతుల తోకూడిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తుందని కాబట్టి ఈ సౌకర్యలను వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు జ్యోతిప్రియ , భారతి, గీతవిద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు

# కావెల్లి గ్రామంలోభీమా పథకం పై అవగాహనా సద్దస్సు



**కోహీర్ జూన్ 18**
**(వుదయం ప్రతినిధి )**

కోహీర్ మండల పరిధిలో ని కవేలి గ్రామం పలు రకాల భీమా పథకాల పై అవగాహనా సద్దస్సు కార్యక్రమం చేపట్టారు ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో పి ఎం ఎస్ బి వై ఇరవై , పీఎంజేజేబివై నాలుగు వందల ముప్పై ఆరు బీమా పథకాల ప్రయోజనాలను వివరించడం జరిగింది . అలాగే సైబర్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సైబర్ మోసలా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ మేనేజర్ శివకుమార్ మరియు ధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదాశివపేట సి ఎఫ్ ఎల్ కోఆర్డినేటర్ సంపూర్ణ కలిసి ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమం లో కెనరా బ్యాంక్ ఖాతా దారులు బ్యాంక్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి, జూన్ 18:వుదయం.**



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కె. లలితాదేవి గురువారం కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సదాశివ పేట అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, బస్తీ దవాఖాన, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు జిల్లా ఆసుపత్రి, టీ హబ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల సేవలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందికి సూచించారు.
అసంక్రమణ వ్యాధుల గుర్తింపు, స్క్రీనింగ్, చికిత్స, ఫాలోఅప్ సేవలను మరింత విస్తరించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. హెచ్‌పీవీ టీకా కార్యక్రమ పురోగతిని సమీక్షించి అర్హులైన బాలికలకు వంద శాతం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఆసుపత్రిలోని టీహబ్ కేంద్రంలో రోగులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించి, మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత, రోగులకు స్నేహపూర్వక సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. లలితాదేవి సూచించారు.

# దూకుడు పెంచిన ఏసీబీ

**-- కూలుతున్న అవినీతి కోటలు**
**- రికార్డు స్థాయిలో ఏసీబీ కేసులు**
**- అభివృద్ధి పనుల్లో అవినీతి వరద ముందు వరుసలో పోలీసు,**
**--రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్**

**వికారాబాద్ జూన్ 18**
**(వుదయం బ్యూరో)**



అవినీతి నిరోధకశాఖ కొరడా ఝళిపిస్తుండటంతో ఆమ్యామ్యాలకు అలవాటుపడే వారి అసలు రంగు బయటపడుతోంది. కేవలం గడచిన 13 రోజుల్లోనే మూడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేసిన అనిశా..ఏకంగా అధికారిక లెక్కల ప్రకారం రూ.36.9 కోట్ల అక్రమార్జనను గుర్తించింది. ఇలా పట్టుబడుతున్న వారిలో ఎవరి ఆస్తి చూసినా మార్కెట్ ధరల ప్రకారం రూ.వంద కోట్లకు తక్కువ ఉండటం లేదు. కాళేశ్వరం మాజీ ఈఎన్సీలు మురళీధర్‌రావు, భూక్యా హరిరామ్, ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ మొదలు ఇటీవల పట్టుబడ్డ హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మర్రి వంశీమోహన్, ఈ నెలలో దొరికిన భుజంగరావు, మోహన్ నాయక్, నరహరిరావుల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.శాఖల ఘనకార్యాలు ఇలా...ఏసీబీ నమోదు చేస్తున్న కేసులు చూస్తుంటే ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలుండే ప్రభుత్వ శాఖల ఉద్యోగులే ఎక్కువగా లంచాల కోసం పీడిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏసీబీ నమోదు చేసిన కేసులలో పోలీసుశాఖ మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది జూన్ 16దాకా పోలీసులపై 14 కేసులు నమోదయ్యాయి. అన్యాయం జరిగిందని బాధితులు పోలీసుల దగ్గరకు వెళుతుంటే ప్రతిదానికి రేటు కట్టి వసూలు చేస్తున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. తర్వాతి స్థానం రెవెన్యూశాఖది. నిత్య జీవితంలో దాదాపు ప్రతి కుటుంబానికీ రెవెన్యూ శాఖతో పనిపడుతుంది. దాంతో ఈ శాఖలో లంచాలకు బరితెగించే వారు ఎక్కువగానే ఉంటున్నారు. ఇక నగరాలు, పట్టణాల్లో మున్సిపల్... గ్రామాల్లో అయితే పంచాయతీల వ్యవహారాలు చూసే ఉద్యోగులు ప్రజల జేబులు గుల్లచి స్పష్టమైన ఆధారాలు సేకరించారు. నిందితులు: ఇన్‌స్పెక్టర్ బి. సరోజ, సబ్‌ఇన్‌స్పెక్టర్ హెచ్. రాణి. కేసు వివరాలు: కుటుంబ గొడవల కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు, నోటీసులు జారీ చేసేందుకు మొదట రూ.60,000 లంచం డిమాండ్ చేయగా, చివరకు రూ.40,000 కు ఒప్పందం కుదిరింది. ఎస్ఐ రాణి.. బాధితుడి నుంచి రూ.20,000 తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఇద్దరు మహిళా పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు.
పెద్దేముల్ మండల రెవెన్యూ అధికారి అరెస్ట్ (మార్చి 2026)పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (RI) రిచర్డ్ సైమన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
అక్రమార్కుల గుండెల్లో అవినీతి నిరోధక శాఖ గుబులు పెట్టిస్తోంది.ఈ మధ్యకాలంలో ప్రభుత్వం పూర్తిగా స్వేచ్ఛనివ్వడంతో ఏసీబీ దూకుడు పెంచింది. అందుకే 2020లో కేవలం 94 కేసులు నమోదవగా.. గత ఏడాది ఈ సంఖ్య 199కి చేరుకుంది. ఈ రెండేళ్ల వివరాలను గమనిస్తే సగటున ప్రతి రెండు రోజులకు ఒకటి చొప్పున కేసు నమోదవుతూనే ఉంది. అయినా సరే.. పట్టుబడతామన్న భయం కూడా లేకుండా యూపీఐల ద్వారా కూడా లంచాలు తీసుకుంటున్నారు. వరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అక్కడున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లకు.. ఏజెంట్లు ఏడాది కాలంలో రూ.42,03,125 చెల్లించినట్లు గుర్తించారు.శాఖలవారీగా జూన్ 16 వరకు నమోదైన కేసులు 2026లో ఇలా రూ.36,92,84,217 విలువైన ఆస్తులు గుర్తించింది. అధికారిక విలువ ఇంతకు పదిరెట్లకు పైమాటే. 2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ రూ.96,13,50,554 విలువైన ఆస్తుల్ని గుర్తించింది. అనధికారికంగా వీటి విలువ కనీసం రూ.వెయ్యి కోట్లు ఉంటుంది.

# పేటలో కొనసాగుతున్న న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ



**నారాయణపేట జూన్18**
**(వుదయం ప్రతినిధి)**

మహబూబ్ నగర్ లో న్యాయవాది వి. నరేందర్ నాయక్ పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్క రించారు.వరుసగా మంగళవారం నుంచి విధులను మూడోరోజు గురువారం కొనసాగించారు.ప్రభుత్వం న్యాయ వాదుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చినప్పటికీ మహ బూబ్ నగర్ రూరల్ ఎస్సై న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమే నని పేర్కొ న్నారు.అక్రమ కేసు ఎత్తివే యాలని డిమాండ్ చేస్తూ కోర్టు విధులను న్యాయవా దులు బహిష్కరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దామో దర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సీని యర్, జూనియర్ న్యాయ వాదులు సీతారామారావు ,వెంకట్ రాజు, సతీష్ గౌడ్, వినోద్ పాల్గొన్నారు.

# పుస్తకాలు అక్కడే కొనాలంటారా..? ఇక కఠిన చర్యలే..!

**- పేరెంట్లపై ఒత్తిడి తెచ్చే స్కూళ్లకు హెచ్చరిక**
**- నిర్దిష్ట వెండర్ల వద్ద కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే చర్యలు.. గుర్తింపు రద్దుకూ**
**-వెనుకాడమని విద్యాశాఖ స్పష్టం**

**గద్వాల జూన్ 18 (వుదయం బ్యూరో)**

పాఠశాలలు సూచించిన దుకాణాలు లేదా వెండర్ల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంతం చేయడం నిబంధనలకు విరుద్ధమని విద్యాశాఖ మరోసారి స్పష్టం చేసింది. పాఠశాల ఆవరణలో గానీ, యాజమాన్యం ఎంపిక చేసిన విక్రేతల వద్ద గానీ తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తేవడం చట్టరీత్యా తప్పేనని హెచ్చరించింది.తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో ముద్రితమయ్యే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సెట్‌లు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. తరగతిని బట్టి సెట్ ధరలు రూ.209 నుంచి రూ.900 వరకు మాత్రమే ఉండగా, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అధిక ధరల పుస్తకాలు, యూనిఫాంల కొనుగోలుకు తల్లిదండ్రులను నిర్బంధిస్తున్నాయన్న ఫిర్యాదులు వెలువడుతున్నాయి.ఈ నేపథ్యంలో



తల్లిదండ్రులకు స్వేచ్ఛగా కొనుగోలు చేసే హక్కు ఉందని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపార ప్రయోజనాల కోసం పేరెంట్ల పై ఒత్తిడి తెచ్చే పాఠశాలలపై జరిమానాలు, గుర్తింపు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు.

# సంగారెడ్డి జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలు



**సంగారెడ్డి వుదయం జిల్లా ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం రాయిపల్లి తాండ గ్రామ పంచాయతీ పరిధి పర్వతాపూర్ శివారులో అరుదైన ఖనిజనిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం రాయిపల్లి తాండ గ్రామ పంచాయతీ పరిధి పర్వతాపూర్ శివారులో అరుదైన ఖనిజనిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. ఈ భూముల్లో వెనేడియం, టైటానియం, అల్యూమినస్ లేటరైట్ నిక్షేపాలు ఉన్నట్టు సంబంధిత అధికారులు, నిపుణులు గుర్తించారు. ఈ ఖనిఖ నిక్షేపాలు ఎలక్ట్రిక్ బ్యాటరీలు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలతో పాటు ఇంధన నిల్వలకు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సంబంధిత శాఖాధికారులు, నిపుణులు పలుమార్లు గ్రామాన్ని సందర్శించారు. సర్వే నంబర్ 5 నుంచి 48 వరకు ఉన్న 800 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ, పట్టా భూముల్లో ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు.ఈ భూముల్లో 335.50 హెక్టార్ల విస్తీర్ణంలో 15.25 మిలియన్ టన్నుల వెనేడియం, 87 మిలియన్ టన్నుల అల్యూమినస్ లేటరైట్, టైటానియం నిక్షేపాలు ఉన్నట్టు నిపుణులు గుర్తించారు. జహీరాబాద్ పట్టణానికి అతి సమీపంలో పర్వతాపూర్ బ్లాక్ ఉండటం.. రవాణా, రోడ్డు, రైలు మార్గాలు దగ్గరగా ఉండడంతో పెట్టుబడిదారులకు కలిసివచ్చే అవకాశం ఉంటుందని కేంద్రం భావించింది. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖనిజ నిక్షేపాలను వెలికితీయడంతో పాటు ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రోడ్‌షో నిర్వహించారు. ఈ నెల 11న గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన గనుల వేలం పాటలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రాధాన్య బిడ్డర్‌గా పాల్గొని గనులను దక్కించుకుంది.అరుదైన ఖనిజ నిక్షేపాలు.. పలు రంగాల్లో కీలక పాత్ర..పర్వతాపూర్ శివారులో లభించే అరుదైన ఖనిజ నిక్షేపాలు పలు రంగాల్లో కీలక పాత్ర పోషించనున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వెనేడియం స్టీల్ తయారీలో, ఉక్కు బలాన్ని పెంచేందుకు, బ్యాటరీల తయారీలో ఎంతగా దోహదపడనుందన్నారు. అల్యూమినస్ లేటరైట్ నిక్షేపాలు డిఫెన్స్ రంగం, ఎయిర్‌క్రాఫ్ట్, మిలటరీ ఆయుధాలు, రాకెట్ల తయారీలో ఉపయోగిస్తారని చెప్పారు.జహీరాబాద్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్వతాపూర్ నిక్షేపాల బ్లాక్‌కు జాతీయ రహదారి 65, రైల్వే మార్గం ఉండటం పెట్టుబడిదారులకు కలిసిరానుంది. ఇప్పటికే హైదరాబాద్‌నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండల పరిధిలోని నిమ్జ్ ప్రాజెక్టు, ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో దోహదపడనుంది. ఖనిజ నిక్షేపాల వెలికితీత, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రియల్ ఎస్టేట్ పరంగానూ అభివృద్ధి చెందనుంది. ఖనిజ నిక్షేపాలు, నిమ్జ్ ప్రాజెక్టు, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పూర్తయితే జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

# కళ్యాణ లక్ష్మి పథకం పేదలకు వరం



***46 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**యాలాల జూన్ 18**
**(వుదయం ప్రతినిధి ):-**

కళ్యాణ లక్ష్మి పథకం పేదల పెళ్లిళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం యాలాల మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష 16 నిరుపేద యువతుల పెళ్లిళ్లకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ప్రభుత్వ పథకాలను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. యాలాల మండలంలో 16 మంది లబ్ధిదారులకు 46 లక్షల 5 336 రూపాయల చెక్కులను పంపించడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వియం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు. స్థానిక తహసిల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనిజ. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు మైపాల్,మాజీ అధ్యక్షులు భీమయ్య, లబ్ధిదారులు హాజరయ్యారు

# విద్యుత్ కోతతో నిలిచిన బ్యాంకింగ్ సేవలు



**- జనరేటర్ లేక ఖాతాదారుల అవస్థలు.. గంటల తరబడి నిరీక్షణ**

**కేటీదొడ్డి జూన్ 02**
**(వుదయం బ్యూరో)**

కేటీదొడ్డి మండలంలోని వెంకటపురం గ్రామంలో ఉన్న ఇండియన్ బ్యాంక్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గురువారం బ్యాంకింగ్ సేవలు గంటల పాటు స్తంభించాయి. జనరేటర్ లేదా ప్రత్యా మ్నాయ విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో నగదు లావాదేవీలు, గోల్డ్ లోన్ సేవలు, ఖాతాలకు సంబంధించిన ఇతర కార్యకలాపాలు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో బ్యాంకుకు వచ్చిన రైతులు, వృద్ధులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంకటపురం, పరిసర గ్రామాల ప్రజలకు ఈ బ్యాంకు ప్రధాన ఆర్థిక కేంద్రంగా ఉంది. వ్యవసాయ అవసరాలు, గోల్డ్ లోన్లు, పెన్షన్ నగదు ఉపసంహరణలు, ఇతర బ్యాంకింగ్ సేవల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఖాతాదారులు ఇక్కడికి వస్తుంటారు. అయితే మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కంప్యూటర్ వ్యవస్థలు, ప్రింటింగ్ సేవలు పనిచేయక బ్యాంకు కార్యకలాపాలు స్తంభించాయి. సేవలు పునరుద్ధరించబడతాయనే ఆశతో పలువురు ఖాతాదారులు గంటల తరబడి బ్యాంకు ఆవరణలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ముఖ్యంగా వ్యవసాయ పనులను పక్కనబెట్టి వచ్చిన రైతులు, అత్యవసర నగదు అవసరాల కోసం వచ్చిన ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవు తోందని, ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు లేకపోవడం వల్ల ప్రజలే నష్టపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విద్యుత్ అంతరాయా లను దృష్టిలో ఉంచుకొని జనరేటర్లు, ఇన్వర్టర్లు వంటి బ్యాకప్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ప్రజలకు కీలక సేవలు అందించే బ్యాంకులో అలాంటి సౌకర్యాలు లేకపోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే జనరేటర్ ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు బ్యాంకు ఉన్నతాధికారులను కోరుతున్నారు

# ఆసుపత్రి వైద్య పరికరాలకు కోట్లు




**అవసరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**
**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**
**- జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశంల కీలక నిర్ణయాలు**

నాగర్ కర్నూల్, జూన్ 18 (వుదయం బ్యూరో) జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమీక్ష సమావేశం గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి ప్రస్తుత పరిస్థితి, రోగుల రద్దీ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వివిధ విభాగాల్లో అవసరమైన ఆధునిక పరికరాల ఏర్పాట్లపై కమిటీ కన్వీనర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి పూర్తిస్థాయి వివరాలను కమిటీకి వివరించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.2,68,79,383లను మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో ఆసుపత్రికి అత్యవసరంగా అవసరమైన వైద్య పరికరాలు, నిర్ధారణ యంత్రాలు, రోగుల చికిత్సకు ఉపయోగపడే ఆధునిక ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.నిధుల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా, ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి సూచించారు. ప్రతి విభాగం నుంచి అవసరాల జాబితాను సేకరించి, సాంకేతిక నివేదికలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలను అత్యవసరంగా సమర్పించాలని ఆదేశించారు.జిల్లా ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సదుపాయాలు జిల్లా కేంద్రంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా అత్యవసర వైద్యం, నిర్ధారణ సేవలు,
జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి అంబులెన్స్ లేదని కలెక్టర్ దృష్టికి సూపరింటెండెంట్ తీసుకురాగా, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న అంబులెన్స్‌ను ఆసుపత్రికి అందజేయాలని, వాటి మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ నేరుగా నిధులు అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి, జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ దావూద్ సులేమాన్, డాక్టర్ శంకర్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రఘు, హరిత, సాయిబాబు, రాధాకృష్ణ, కవిత, పోతుల శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ రామకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ రవి నాయక్, వివిధ విభాగాల వైద్యాధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి పరిపాలనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భార్యతో అక్రమ సంబంధం.. చర్యలు తీసుకోవాలంటూ వాటర్‌ట్యాంక్ ఎక్కిన భర్త

**- పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్య హెచ్చరిక.. గద్వాలలో ఉత్కంఠ**
**- ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌పై**
**-ఆరోపణలు.. సీఐ హామీతో దిగివచ్చిన బాధితుడు**

**గద్వాల జూన్ 18 (వుదయం బ్యూరో)**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గురువారం ఉత్కంఠభరిత ఘటన చోటుచేసుకుంది. తన భార్యతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న ఎత్తైన వాటర్‌ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించడం సంచలనం సృష్టించింది. చేతిలో పెట్రోల్ బాటిల్‌తో ట్యాంక్‌పైకి ఎక్కిన బాధితుడు, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత పోలీసు ఉద్యోగిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో ప్రాణాలు తీసుకుంటానని హెచ్చరించాడు. దీంతో సంఘటన స్థలం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గద్వాల సీఐ టి. శ్రీను బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి, అతడి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. సీఐ హామీతో బాధితుడు వాటర్‌ట్యాంక్‌పై నుంచి కిందికి దిగడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖకు చెందిన ఉద్యోగిపై వచ్చిన ఆరోపణలు, వాటి నేపథ్యంలో బాధితుడు ఆత్మహత్యాయత్నానికి దిగడం తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# జాజాపూర్ ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి చేస్తా

**--కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి**

**నారాయణపేట జూన్18**
**(వుదయం ప్రతినిధి)**

జాజాపూర్ గ్రామ ప్రజల ఆశీర్వాదంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి అన్నారు. నారాయణపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టిన సందర్భంగా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని గురువారం శీల గార్డెన్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తనను ఎన్నో ఇబ్బందులకు గురిచేసారని అయినా కూడా వారిని ధిక్కరించి కాంగ్రెస్ జెండా పట్టుకుని పోరాటం చేశానని నేడు ఆ పోరాటమే నన్ను మండల అధ్యక్ష పదవి వరకు చేర్చిందని ఇందుకుగాను జాజాపూర్ గ్రామ ప్రజల ఆశీర్వాదం అండదండలు పూర్తిస్థాయిలో ఉన్నాయని ఆయన సభాముఖంగా గుర్తు చేశారు. అంతేకాక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి డిసిసిబి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆశీర్వాదంతో మండలాన్ని పూర్తిస్థాయిలా అభివృద్ధి చేస్తానని ఆయన సందర్భంగా హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రతి పథకాన్ని నిరుపేదకు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖులు హాజరు అయ్యారు.

